# ధర్మాభిషేకము

రచయిత, ప్రకాశకులు :

**డా॥ గుర్లింక ధర్మరాజు**

M.A., Telugu Pandit, B.Ed., Ph.D.

ఆంధ్రోపన్యాసకులు, తెలుగుశాఖాధ్యక్షులు

**మహారాణీ కళాశాల, పెద్దాపురం** - 533 437,

తూ॥గో॥జిల్లా. **సెల్ : 98487 24374**

'సర్వహక్కులు రచయితవే'

ప్రథమ ముద్రణ : 2017

ప్రతులు : 500

**వెల : రూ. 40/-**

చిరునామా :

**డా॥ గుర్లింక ధర్మరాజు,** ఆంధ్రోపన్యాసకులు

C/o శ్రీ నిమ్మకాయల నారాయణరావుగారు

డోర్ నెం. 17-1-16, నాగిశెట్టివారి వీధి,

**సామర్లకోట - 533 440**

సెల్ : 98487 24374

# ముందుమాట

**"ధర్మాభిషేకము"**ను రచించుశక్తి నాకొసగిన ఆ పరమేశ్వరునికి ముందుగా నమస్కార కృతజ్ఞతలు తెల్పుకొనుచున్నాను. నాకు ధర్మశతకము, ధర్మరాజీయము, ధర్మప్రబోధము, ధర్మాంజలి ఇచ్చిన చేయూతనే ఈ గ్రంథము నకు ఇచ్చి నన్ను ప్రోత్సహించిన గురుదేవులు శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్యగార్కి, కవిరత్న శ్రీ కందుకూరి శ్రీరామచంద్రమూర్తి, ఎం.ఎ., గారికి, కవిసభాపతి శ్రీ సలాది ప్రభంజనస్వామి గార్కి నా కృతజ్ఞతాంజలి సమర్పించుకొనుచున్నాను.

నాకు జన్మనిచ్చిన కీ॥ శే॥ శ్రీ గుర్లింక గౌతయ్యగారు, మాజీ ప్రెసిడెంట్ నంగవరం, శ్రీమతి సత్యవెంకట తులసీ దమయంతి అనే ధనమ్మగార్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

పెద్దాపురం మహారాణి కళాశాల పాలకవర్గ ఫౌండర్ ప్రెసిడెంట్‌గార్కి, పాలకవర్గ అధ్యక్షులకు, కరస్పాండెంట్‌గార్కి, మెంబర్లకు, ప్రిన్సిపాల్‌గార్కి, వైస్ ప్రిన్సిపాల్‌గార్కి, సూపరింటెండెంట్‌వార్కి, తెలుగుశాఖ అప్పటి అధిపతులు మరియు రీడర్ డా॥ ఎ. సుబ్బారావుగార్కి, తెలుగు రీడర్స్, డా॥ బి.ఎస్. జ్ఞానేశ్వరిగార్కి, డా॥ జె. కృష్ణబాబుగార్కి, విశ్రాంత అధ్యాపకులు బి.ఎస్. భాస్కరకుమార్‌గార్కి, తెలుగు లెక్చరర్స్ శ్రీ టి.వి.వి. సత్యనారాయణగార్కి, శ్రీ ఎస్. సూర్యనారాయణగార్కి, శ్రీ జి. మోహన్‌దుర్గారావుగార్కి, కళాశాల అధ్యాపక అధ్యాపకేతరులందరికీ పేరుపేరునా నా ప్రేమపూర్వక కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను. రిటైర్డ్ ప్రిన్సిపాల్స్‌కి, వైస్ ప్రిన్సిపాల్స్‌కి సూపరింటెండెంట్స్ గార్కి, లెక్చరర్స్‌కి నా నమస్కారములు, కృతజ్ఞతలు.



నా అక్కలకు, బావగార్లకు, అన్నయ్యలకు వదినగార్లకు నా నమస్కార ములు, కృతజ్ఞతలు. వారి సంతానమెల్లరకూ, నా భార్యాబిడ్డలకు నా దీవెనలు. నా శ్రేయోభిలాషులకు, నా భుజంపై చేయి వేసి ధర్మరాజా! అని నన్ను పిలిచే వార్కి, నాకేదైనా సమస్య వస్తే వెంటనే చెప్పుకొంటే వినే గొప్ప వ్యక్తులకు నా వినయపూర్వక కృతజ్ఞతలు.

సాహితీ విషయాలలో నాకెన్నో సలహాలనిచ్చిన కుమారి చర్ల ఏణాక్షిగార్కి, శ్రీ చర్ల వెంకట సీతారామారావుగార్లకు నా కృతజ్ఞతలు.

ప్రపంచశాంతికి దోహదపడే ప్రతీ ఒక్కరికీ నా కృతజ్ఞతలు.

**"అంజలించుచుంటి అమ్మకు నాన్నకు**
**అంజలించుచుంటి ఆప్తులకును**
**అంజలించుచుంటి అయిన వాళ్ళకునేను**
**అంజలించుచుంటి అందుకొనుడు."**


చిరునామా :

**డా॥ గుర్లింక ధర్మరాజు,** ఆంధ్రోపన్యాసకులు, శాఖాధిపతి

మహారాణీ కళాశాల, పెద్దాపురం

సెల్ : 98487 24374

## శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్యగారు

ఆ. మంచితనము జూపి మనసార దీవించి
శిష్యకోటికెంతొ శిక్షణిచ్చి
గురువుస్థానమెంతొ గొప్పదై వెలుగొంద
ధరణినిల్చునట్టి ధర్మపరులు

ఆ. మంచిచెడును నేర్పి మా మంచి బ్రతుకులు
తీర్చిదిద్దినారు తేజమలర
మీదు మాటలెపుడు మేమెప్డు మరువము
ధన్యజీవులయ్య ధరణి మీరు

ఆ. రక్షణొసగునట్టి రాజీవనేత్రులై
శిక్షణొసగు కన్ను శివునిదౌర
రామచంద్రులంత రత్నమ్ము మీమాట
ధర్మపథము జూపు ధర్మమూర్తి

ఆ. మాట మీద నిలచి మణిరత్నమైమీరు
బాట చూపి మమ్ము పదిల పరచి
రాచబాట చూపి రక్షించినారయా
వందనములు స్వామి అందుకొనుడు

ఆ. గ్రామ ప్రజల కెంతొ గౌరవమ్మును జూపి
సేవ జేసినారు చేవజూపి
ప్రజల క్షేమమలర పండితులైనట్టి
గురువు గొప్పదనము తరుగదన్న!



## శ్రీ ఎస్.బి.పి.బి.కె. సత్యనారాయణరావుగారు

1. మాట మంచిదాయె మనసంత మంచిదై
ఎదుటివారి మనసు కుదుటపడగ
చంటిదొరకు నెవరు సాటిరారిలలోన
కంటి వెలుగు మాకు కమల నయన!

2. మరపురాని మనిషి మా మధ్య లేరయో
ఎంత దుఃఖమయ్యె ఎంత బాధ
తెలుగు సాహితికి దీటైన వారలై
సేవచేసినారు జీవితమున

3. బ్రతుకు విలువ తెలిసి బ్రతికినారిలలోన
ముందుచూపు కలిగి ముందుకేగి
రాజకీయమెపుడు రాణించె వీరికి
తగిన పదవి వీరి దరిని చేరె!

4. బీదసాదలందు ప్రేమతో మెలగిన
చంటిదొరల ఖ్యాతిమింటికెగసె
మనకు విద్యనొసగ మనసైన పురములో
విద్యగరపు కోర్కె వీరి సొత్తు

5. దాని ఫలము నంది ధన్యులై వెలుగొంద
పెద్ద పురికి వేసె పెద్ద పీట
ఋణము తీర్చలేము ఋణపడి నామయా
మిమ్ము మరువమయ్య మేము తండ్రి!

## వరుణదేవ

1. కరుణ చూపించు మాపైన వరుణదేవ
బీదసాదలమయ్య మాకేదిదారి
చేతికందెడి పంటలు ఛిద్రమాయె
అధిక ధరలేమో ఆకాశమంటుచుండె!

2. దిక్కులేనట్టివారికి దిక్కు నీవు
బిక్కచిక్కిన ప్రాణులు బ్రతుకు నటుల
ఆదుకోవయ్య వరుణుడా ఆదుకొమ్ము
దీర్ఘకాలమ్ము కురువకు దేవ దేవ!

3. ఎండలేకున్న బ్రతుకులు బండవారు
కర్మసాక్షికి తెలిసిన ధర్మమిదియు
ఆయురారోగ్య మైశ్వర్యమంత తానె
వరుణదేవుడా మముగాచు వంతునీది

4. ఆంధ్రదేశమ్ము కెన్నెన్ని ఆటుపోట్లొ
నవ్వుజూడని జనులంత కెవ్వుమనగ
తీవ్రమైనట్టి వర్షమ్ము తెఱపులేక
ఉరుములురుమంగ పిడుగులై ఒక్కమాఱు!

5. మనుషులేకాదు పశువులు మాడెనయ్యొ
దీన హీనమ్ముగా మారె తిండిలేక
ఎన్ని దిక్కులు చూచిన అన్ని చోట్ల
జలము జలమయ్య నంతటా జలము తండ్రి



## డా॥ బట్రెడ్డి రామారావుగారి దివ్యసముఖమునకు డాక్టర్ గుర్లింక ధర్మరాజొసంగు పంచరత్నములు

1. స్వార్థమెరుగనట్టి వారిని గుర్తించి
రామచంద్రుడతని క్షేమమరయు
ధర్మరాజు మనసు నిర్మల మౌగదే
ఉన్నమాట చెప్పుకొన్న నాడు!

2. కోట్లు కూడబెట్టు కొనుటయు తెలియదు
రోగి బాధ వినెడి యోగి మీరు
పాప భీతి తెలిసి పద్ధతి తెలియును
సత్యపాలనమున ముత్యమౌర!

3. తండ్రి పేరు నిలుపు తనయులు మీరయా
అంతకంటె ఘనులె అవని మీద
హస్తవాసి గొప్ప అంతకంటెనుకూడ
మాట గొప్పదైన నీటు మనిషి!

4. అన్ని బాధల కన్నయీా అవనిమీద
గుండె బాధయె గొప్పదై కుములుచున్న
ధనము లేకున్న రోగికి ధైర్యమిచ్చి
ఎన్ని ప్రాణముల్ నిలిపిరో ఎవరికెరుక!

5. మంచి భార్యయు బిడ్డల నెంచతరమె
కోరుకున్నట్లు దొరకిరి వారు మీకు
పరుష వాక్యముల్ తెలియని పురుషులౌర
మంచి గుణములు కలిగిన మంచివారు!

## డా॥ కస్తూరి శ్రీధర్‌గారికి
## డాక్టర్ గుర్లింక ధర్మరాజొసంగు పంచరత్నములు

1. గుండెపోటు వచ్చి కుమిలెడివారికి
గుండె ధైర్యమిచ్చు నిండు మనిషి
వైద్యమెంతొ మీరు హృద్యమ్ముగా జేసి
కాపు కాచినారు కవిని మీరు!

2. నవ్వు మోము మీది నవ్వుచూ మాట్లాడి
రోగి బాధలన్ని రూపు మాపి
స్టంట్సు వేసి నన్ను చక్కగా రక్షించి
వయసు పెంచినట్టి వారు మీరు

3. సమయపాలనమ్ము చక్కగా పాటించి
మీదు దరికి జేర్చి మేలు చేసె
ఆయనెవరొ తెలుస ఆ రామచంద్రుని
నామమందినట్టి రాముడితడు!

4. క్షేమమయ్య మీదు క్షేమమ్ము కోరెద
దేవదేవులంత దీవెనిడగ
తిరుగులేదు మీకు దేదీప్యమానమై
వెలుగునందు నట్టి విజ్ఞులయ్య!

5. ఇంటి పేరు గొప్ప ఇలవేల్పు గొప్పదై
కంటిపాపవోలె కాచినారు
గుండెబాధ తీర్చి గుబులంత పోగొట్టి
శాంత పరచినట్టి శాంతమూర్తి!



## డా॥ గుర్లింక ధర్మరాజు
## Sri. VSRS సోమయాజులుగారికి సమర్పించు పంచరత్నములు

1. సోమయాజులు గారికి క్షేమ మరసి
చక్కనైనట్టి బిరుదును సభ్యులొసగ
ధర్మరాజుకి కలిగెను సంతసంబు
కవిని కన్నట్టి తల్లికి కడుపు చలువ!

2. నిత్య నూత్నమ్ము మీవిద్య ముత్యమల్లె
పరుల హృదయమ్ములోదాగు పదియునాళ్ళు
సాహితీమాత మిముగని శాంతినందె
హృదయ ముప్పొంగ దీవించి ముదమునందు

3. మంచిమనసున్న మారాజు నెంచతరమె
సోమయాజులు యున్నట్టి శోభ వేరు
సభకు నిండైన గౌరవ సభ్యులంత
మెచ్చుకుండంగ నుందరు మేలు మేలు

4. అందమైనట్టి సభలోన ఆదరించి
హృదయమర్పించి వినుటది ఎంత ఘనత
నాడు జరిగిన సభనాకు నేడు గుర్తు
అంత చక్కటి కవి మీరె అందగాడ

5. భోగభాగ్యాలు కొన్నాళ్ళె బుగ్గిపాలె
రాజరాజల్లె శోభిల్లు రాజు మీరు
నేటి కవులెందరున్నను మేటి మీరె
పంచరత్నాలు గైకొని పరవశించ!

## డా॥ సి. నారాయణరెడ్డిగారు

*Rtd., Professor in Telugu Department*

1. జ్ఞానపీఠమంది జనులకు దగ్గరై
క్షణము క్షణము నితడు కవితలల్లి
ఇంట బయట కూడ ఇలవేల్పు కవితలే
వ్రాయురీతి గొప్ప జాయకుదిరి

2. ఎన్ని కవితలండి ఈతని కలముతో
వ్రాయగల్గినాడు హాయిగాను
గజలు వ్రాసెనితడు గాత్రమ్ము మంచిదై
పాట పాడినాడు బాట తెలిసి

3. ఎన్ని సభలొ ఇతనికెప్పటికప్పుడు
నిండుకుండ ఇతని కెవరు సాటి
అందమైన కవిత నలవోకగా వ్రాసి
పాడగల్గినట్టి పట్టు కలదు!

4. నందమూరికెంత నచ్చెనో ఈతని
పాట వ్రాయు తీరు పరవశించి
నిండు మనిషి ఇతడు పండువెన్నెలవోలె
అందమైన కవితలల్లువాడు!

5. ఎచటపుట్టినావొ ఎన్నెన్ని యామడ్లొ
నడచివెళ్ళినావు బడికినాడు
చదువునేర్చినావు శ్రద్ధగా బడికేగి
కవితనేర్చినావు భవిత తెలిసి!

6. నిన్నుబోలిన కవిరత్న మిలనులేదు
అన్యులందరు నినుమెచ్చునందగాడ
ఆంధ్రజాతికి కాన్కగా అమ్మయొసగె
నిన్ను మరువని క్షణములే దిలను నేడు!



## శ్రీ తలసిల దామోదర్‌గార్కి పంచరత్నములు

ప్రిన్సిపాల్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ బాయ్స్, మచిలీపట్నం

1. ధర్మమైన మనిషి కర్మభూమిలొ పుట్టె
దారితప్పరెపుడు ధర్మమెఱిగి
ధర్మమైన పనులు తమవంతుగా చేయు
నిర్మలాత్మ ఇతడె నీటు మనిషి

2. అందమైన మాట అంతకంటెను కూడ
చూపుగొప్పదైన సోయగమ్ము
ప్రేమ పంచిపెట్టు పెన్నిధై వెలుగొందు
ధర్మరాజు మనసు తనకె తెలుసు

3. తలసిల దామోదరులకు
పలుకులు పలుకంగ తెలుసు పద్ధతి తెలియున్
విలువలు తెలిసిన మనిషికి
వలలో పడవేయ తెలుసు పలువురి నెపుడున్

4. ఎవరు కొలువగలరు ఎత్తైన మిమ్ముల
మిమ్ము కొలువగలుగు దమ్మదేది
మంచి మనసు కలుగు మా బోటి కవులకే
సాధ్యమౌను స్వామి సాధ్యమౌను!

5. ఇంట గెలిచినారు ఏ పూజ చేసిరో
బైట గెలిచినారు పౌరుషముగ
చంటిబిడ్డ వోలె సాకిరి శిష్యుల
మరపురాని మనిషి మాకు దొరకె!

## కృష్ణా పుష్కరములు పంచరత్నములు

1. కృష్ణ నదిని చూడ తృష్ణతీరును నీకు
భక్త జనులు వచ్చి ముక్తినంద
ఎంత భక్తి శ్రద్ధ ఎంతెంత పుణ్యమో
పొందగోరి వచ్చి సందడింప!

2. తీరప్రాంత జనులు దేదీప్యమానంగ
స్నానమాచరించి మౌనముగను
పిండములను పెట్టి ప్రేమతో పెద్దల
తలచు కొనిన రీతి ధాత్రి నిలుచు

3. ఇంజనీర్లు చూడు ఎంతెంతొ శ్రద్ధతో
కట్టడములు కట్టి కాలువలను
మూలమూలలకును మోజుగా నడిపించె
ఇంత పంట భూమి ఎచట కలదు?

4. ముఖ్యమంత్రి శ్రద్ధ మురిపమ్ము గొల్పదే
పుష్కరాలు జరుపు పోటు గాడు
ముందు చూపుతోడ ముందుకేగునితడు
ధైర్య సాహసములు తనకె తెలిసి

5. "బ్రాహ్మణయ్యలంత బాగుగా నడిపించు
శక్తి కలిగినారు సహజముగను
మంత్ర మహిమ తెలిసి మర్యాద తెలియును
భక్తులెందరైన ముక్తి పొందు"



## పద్యవిద్యకు పంచరత్నములు

1. పద్యమొకటి వ్రాసి పదిమందికీ చెప్పి
విఱ్ఱవీగువాడు వెఱ్ఱివాడు
మనకు ముందు కవులు మహనీయులని చెప్పు
అందమైన పనికి అందమదియె!

2. పూర్వకవుల గొప్ప పొందికగాచెప్పు
భరత జాతి గొప్ప బయటపడును
జాతి గొప్ప తెలిసి జాగృతి తెలియును
కవుల గొప్పతనము కాంచినపుడు!

3. పద్యరత్నములను పంచిపెట్టుట మేలు
పద్యవిద్య మనకు భాగ్యమోయి
కళలకున్న విలువ కాదనువారేరి
విలువ తెలిసినపుడు వేదనేది (నేల)?

4. చిన్న పద్యమనుచు చీకాకు పడుటేల
భావ మరసినపుడు బాగు బాగు
పెద్ద చిన్నయనెడి భేదమ్ము మనకేల
జ్ఞాన మార్గమొకటి చాలు మనకు

5. లోతు తెలిసినపుడు లోచూపు తెలియును
చిత్తశుద్ధి యున్న శివుడు మెచ్చు
ధనిక బీదయనెడి తారతమ్యములేల
అందరొకటెయనిన అందమోయి

## కిర్లంపూడి గ్రామము పంచరత్నములు

1. పచ్చని పంటభూములకు పైరులకెంతటి ఆలవాలమో
మెచ్చునివారులేరు మరిమెచ్చుట కింకను ఎన్నియున్నవో
మచ్చులు లేని నాయకులు మంత్రపుజల్లులకాలవాలమై
ముచ్చటగొల్పు మీ సిరులు ముందుతరమ్ముల కెంతసంపదో (భాగ్యమో)

2. రాజకీయమెంత రాణించుచున్నదో
ఆంధ్రరాష్ట్ర ప్రజల కందమిదియె
దేశసేవ చేయ దీటైన నాయకుల్
పుట్టిపెరిగెనిచట పట్టు కలిగి

3. ఊరుపేరు గొప్ప ఊరంత గొప్పదై
దశదిశల కిదియె దారిచూపు
అంత పట్టు కలిగి ఆంధ్రకే అందమై
పల్లెపౌరుషమున కెల్లలేవి?

4. ముందుముందు కిదియె మొనగాడు కాగల
దనెడి ఊహ నాకు తట్టెనయ్య
క్షేమమయ్య మీదు క్షేమమ్మునరయంగ
ధర్మరాజు మాట తప్పదయ్య

5. పాడిపశువులన్ని పదిలమ్ము నెప్పుడున్
ఊరిమేలు నేను కోరుచుంటి
దేవదేవులంత దీవించుచుండగా
క్షేమమయ్య మీకు క్షేమమయ్య!



## సుజలాం - సుఫలాం

తే॥ నీటిగుంటలు త్రవ్వంగ నీరునిలచి
నీటిమట్టమ్ము పెరుగుట నిజము నిజము
సహజ వనరుల కాపాడు జనులు నేడు
నీటిగుంటలు త్రవ్వుట నేర్చినారు

ఆ॥ నీటి విలువ తెలిసినాటి నాయకులంత
చెఱువులెన్నొ త్రవ్వి కఱవు తీర్చె
పంచభూతములను పదిలమ్ముగా జూడు
అందులోన నీటినంత కన్న

ఆ॥ జలము ధనము నేడు జలజసంపదకెంతొ
బలము జలము మనకు నిలను చూడ
పాడి పంటలన్ని బలముగా జలముతో
పెరిగి వృద్ధి చెందు పృథ్వినెపుడు

ఆ॥ ప్రాణికోటికెంత పరవశమ్మొ జలము
నీటి చుక్క లేక నిలువ లేము
కాటుకందమొసగు కనులను చూడంగ
నీరు ముఖ్యమయ్య నేడు మనకు

ఆ॥ వృక్షసంపదెంతొ వృద్ధి చెందును చూడ
జలము వృద్ధి చెంది బలము కలుగ
పంటలన్ని పండి ఇంటను సిరులతో
నిండినపుడె మనకు నండ దండ!

## శ్రీమతి & శ్రీ శిరగం స్నిగ్ధా, తేజా బాబులకు పంచరత్నములు

1. చక్కనైన జంట సరిజోడి ఇద్దరూ
నేర్పు తోడ మెలగి నెమ్మదించి
కలసి మెలసి వీరు కలకాల మొక్కటై
ముచ్చటించు తీరు మురిపమౌర!

2. తల్లిదండ్రులందు దయతోడ జీవించి
చెల్లిమీద ప్రేమ చేరువౌగ
భార్యమీద ప్రేమ పదిలమ్ము తేజాకి
అత్త మామలందు అంత కన్న!

3. భక్తి కలిగియుండు భగవాను నీకండ
కష్ట సుఖములందు కాయగలడు
మరపురాని భక్తి మదిలోన నిలబెట్టు
తిరుగు లేదు నీకు తేజబాబు

4. అమ్మ మంచిదయ్య అమ్మమ్మ మంచిదై
వీరభద్రరావు విజయమదియె
నాన్న మంచివారు నాన్నమ్మ మంచిదై
తేజబాబు కింత తృప్తి కలదు

5. ఆయురారోగ్యమైశ్వర్యమందు కొనుచు
తృప్తి తీరంగ జీవించ తృప్తి కలిగి
ఉన్నతమ్మైన ఊహలు ఉజ్జ్వలముగ
తిరుగులేనట్లు జీవించు తేజబాబు



## శ్రీ ఆర్.పి. పట్నాయక్ (సినీ మ్యూజిక్ డైరెక్టర్)

1. స్నేహజీవి మీకు స్నేహమ్మె ప్రాణమ్ము
అదియె ఋజువుపరచె నాప్తుడొకరు
హృదయ భారమంత కెరటాల అలలలో
తేలియాడినపుడె తేలికాయె!

2. ఎదుటనున్న వ్యక్తి ఎంతగా పొగిడిరో
దూరదర్శనమున దూరి చూడ
నాకు కూడ తడిసె నయనాలు నిండుగా
స్పందనమున మీకు వందనములు

3. చిత్తశుద్ధి కల్గి మత్తును గొల్పంగ
లలిత కళలలోన మిళితమైరి
పాట కాయితముగ బాటను వేయంగ
ఆర్.పి. కెఱుక కనుక అందగించు

4. కష్టకాలమందు కమనీయమైనట్టి
పాట నేర్చి కూర్చి పదిలపఱచి (పాట పాడి)
ప్రజల హృదయమందు పదికాలములు నిల్చు
నింత కంటె గొప్ప ఏది కలదు

5. రాగరంజితముగ రమణీయమైనట్టి
పాట సిద్ధపరచు నాట నేర్చి
ఎన్ని గమకములను ఇంతగా కూర్చుట
ఎవరితరము స్వామి ఎవరితరము

*ది. 18-1-2015*

**"ఝుమ్మందినాదం"** *ఈ టి.వి. ప్రోగ్రాం చూసి వ్రాసిన పద్యములు*

# సాయిబాబా గీతము

1. సాయిని మించిన దైవం లేదు
హాయిని గొల్పంగా
మాయామర్మం తెలియనివారికి
సాయే రక్షకుడు
మోక్షమార్గమును మనకు చూపగా
ముందుకు రాగలడు
చావూ పుట్టుక సహజమేనని
చాటి చెప్పగలడు.

2. సాయిధామమది చక్కని చోటది
ముక్తిని పొందగను
బంధవిముక్తిని పొందాలనినా
సాయిని కొలవండి
మాయలొ పుట్టి మాయలొ
పెరిగే మమతను విడవండి
నిజమును తెలిపే పథమును
చూపును సాయిని కొలవండి

3. పండితులందరు నిండుగ
వ్రాసిన గ్రంథములెన్నున్నా
గుండె ధైర్యమును గొల్పేవాడూ
సాయే మనకన్నా
కలియుగమునకే గొప్ప దేవుడు
సాయినాథుడండీ
కొలచినవారికి ఫలములనిచ్చును
సాయిని కొలవండి



# తెలుగు సాహిత్యంలో నీతి చంద్రికలు
## పొమ్మనకు బిడ్డా నీ పంచనుంటాం

1. తల్లిదంౘ్రుల దూరమ్ము తరుమరాదు
భక్తిశ్రద్ధలు చూపించు ముక్తి కలుగు
వారి కోర్కెలు తీర్చంగ భారమేల
జన్మజన్మాల పుణ్యమీ జన్మ దొరకె

2. తప్పటడుగులు వేయంగ తప్పుదిద్ది
గొప్ప మార్గమ్ము జూపిన గొప్ప ఘనులు
అప్పుడప్పుడు నిను తిట్టి ఒప్పు జూపి
ముప్పు రాకుండ కాచిరి ఒప్పుకొనుము

3. చిన్నతనములో నిను జూచి అన్నిమఱచి
ఎన్ని ముద్దులు పెట్టిరో ఎవరికెఱుక
అన్నిముద్దులు పెట్టిన అమ్మనాన్న
న్నేడు దూరమ్ము చేయుట నీకు తగున?

4. భోగ భాగ్యముల్ కోరని బుద్ధిమతుల
చీదరించుటనీకేల ఆదరించు
ఎంత ఆనందమో చూడ చెంతనుండ
దూరమేలయ్య పంపుట ఘోరమదియె!

5. బ్రతికినన్నాళ్ళు వారిని బ్రతుకనివ్వు
మార్పు మనలోనె వచ్చుట మంచిదయ్య
చివరి రోజులు వారికి చేతకాకె
ఇప్పుడిబ్బంది పెట్టుట ఇదియు నిజము

6. తనివితీర నీవు తల్లిని ప్రేమించి
తండ్రి యెడల నీవు దయను జూపి
మంచితనయుడనెడి మమతకు దగ్గరై
తృప్తి తీర జూడు తృప్తి కలుగు

7. లెక్కజూడదయ్య లెక్కించదెప్పుడున్
తల్లిదండ్రి ఖర్చు తనయుడెపుడు
నిన్ను పెంచినపుడు నీ తల్లిదండ్రులు
లెక్కజూచుకొనిర? ఎక్కువనిర?

8. బిడ్డ పుట్టినపుడు దొడ్డవారనినారు
నేడు చూడవాడు మేడి పండె
తనకు ప్రేమలేక తన భార్యపై నింద
మోపి తప్పుకొనెడి మోటవాడు

9. అమ్మ! నాన్న ఏడి? అన్నము తింటివా?
అనెడి బిడ్డ జూచి అమ్మ మెచ్చు!
అయ్య! అమ్మ ఏది! అన్నము తింటివా?
అనెడి బిడ్డ జూచి అయ్య మెచ్చు!

10. మెచ్చుకోలె కాదు మెరుపంత సంబర
మంబరమ్ము తాకుటదియె ఘనత
పుత్రుడెంత ఘనుడొ? పున్నామ నరకమ్ము
లేని విధము జేయు జ్ఞాని కనుక

11. పుత్రసంతానమెంతటి పుణ్యమనుచు
విఱ్ఱవీగితిమానాడు వెఱ్ఱిచేత
సంతులేకున్న ఎంతటి సంబరమ్మో
తెలిసికొంటిమి ఈనాడు తెలిసికొంటి

12. వల్లకాటిలో విడుచుట వైభవమ్మ?
ప్రాణముండంగ మమ్ముల హీనముగను
ఊరిపెద్దలు తిట్టంగ దారిలేక
తిరిగి మమ్ముల పోషించె కరుణ కలిగి



13. పిల్లపీచు లేక తల్లడిల్లుచునుండ
సంతువొకటి కలుగ సంతసించ
బిడ్డ కలిగినపుడు ప్రేమతో పెంచగా
భారమైతిమిపుడు భారమైతి

14. అడ్డమైనగడ్డి ఆనాడు కఱచితి
నిన్ను పెంచుటకును నిజము బిడ్డ
స్వార్థ చింత తోడ సాకితి నిన్నయ్యొ
నేడు బరువు మేము నీకు తండ్రి

15. నీదు చదువుకొఱకు నే పడ్డ పాట్లెన్నొ
లెక్కవేసికొనిన బిక్కమొగమె
తనయుడనుచు నిన్ను తగినట్లు చదివించె
చిల్లి గవ్వ లేక చేతిలోన!

16. ధనము లేక మమ్ము దరిచేరనందువు
ఫలము లేని బ్రతుకు పాడు బ్రతుకు
స్వార్థ బుద్ధి లేని వారము నా తండ్రి
గుప్పెడన్నమొసగు కూర్మి తండ్రి!

17. తనదు భార్య వినదు తనయుడూ వినడాయె
శత్రువల్లె జూచు పుత్రుడాయె
మాదు మొరను వినెడి మనుజుడేలేడాయె
ముసలితనము ఎంత ముప్పు మాకు

18. అమ్మ యంట్లుతోమి ఆపనీ ఈపనీ
చేయగలదు తండ్రి చేయగలదు
నేను శక్తి కొలది నీ యింటి పనులను
చేయగలను తండ్రి చేయగలను

19. మందు మాకు లేదు మా బోటి వాళ్ళకు
తిండి బాధ యొకటె తీర్చు తండ్రి
ఒక్కరెక్క మీద ఓ అయ్య కష్టమ్మె
కాదు లేదు యనిన గడచుటెట్లు

20. ముసలితనము తండ్రి కసరికొట్టకుమమ్మ
దెబ్బపడగలేము జబ్బ సలుపు
నీదు భార్య నిన్న నిలువునా పొడిచింది
తాళలేము తండ్రి తాళలేము

21. కన్న తల్లి దండ్రి కొన్ని నాలిలపైన
ఉండగలరు తండ్రి ఉండగలరు
మాకు చావురాదు నీకు కోపము పోదు
రాజసమ్ము పోయి రాళ్ళమైతి

22. మాదు కోర్కెలెన్నొ ఆదరముగ తీరు
ననెడి యాశలన్ని అంతరించె
గంట గడువదాయె కడ తన్క యిక్కట్లె
కూతురొకతెయున్న కోర్కె తీరు

23. సగము చచ్చినాము మొగము జూడనపుడు
పొగరు తగ్గిపోయె పూర్తిగాను
మ్రింగ మెతుకు కొఱకు మిలమిలా చూపులు
ఆకలయ్య మాకు అన్నమొసగు

24. అనుమతించగోరి అర్జీలు పెట్టినా
మరణమనుమతించు మంత్రులేరి?
మరణమొకటె దారి మరణమ్ము రాదాయె
శరణు శరణు శరణు శరణు స్వామి!

25. తల్లిదండ్రుల పోషించు తనయుడొకడె
భరతమాతకు ముద్దుల పట్టియనుచు
ఖండ ఖండాంతరమ్ముల ఖ్యాతి కలుగ
పుత్ర కామేష్టి జరుపంగ పుట్టునేమొ!



# మధుసేవ

1. త్రాగుబోతులెపుడు త్రాగుచూ తూలుచూ
ఎవరి మాట వినరు ఎందుకనగ?
చిన్న మెదడు చెడగ, చేదయ్యె బ్రతుకంత
అందువలనె వారలజ్ఞులైరి.

2. నీవు త్రాగు బ్రాంది నీటైన దందువా
అందులోన కలదు మందు కొంతె
రంగు నీళ్ళు కలిపి రంగరించిరి కదా
అదియె నిజమనెంచి అజ్ఞులైరి.

3. కల్తిసార త్రాగి కమ్మగా నిద్రించి
తిరిగి లేవలేరు స్థిరము తప్పి
ఎందుకిటుల జరిగె ఏమిటీ కారణం
అనుచు తెలిసికొనగ అజ్ఞులైరి

4. ధనము ధనము ధనము ధనమొక్కటే గొప్ప
ప్రాణమనిన విలువ ప్రాణికేది
అసలె మత్తు మందు ఆపైన కల్తీలు
రోజు రోజు చావు రుజువులాయె!

5. శవము పైన ధనము చాల సంపాదించి
ఎంత బాగు పడిన ఏమి గొప్ప
నీవు పొందు ధనము నీ ముందె నాశనం
ఇదియు తథ్యమయ్య ఎన్నడైన!

6. పిల్ల పాపలంత ప్రేమతో పెరుగుట
ఎంత అందమయ్య ఎప్పుడైన
పాడు బ్రాంది త్రాగి పాపల్ని కొట్టుట
ఎంత పాపమయ్య ఎంత కర్మ!

7. నాన్న ఇల్లుజేరి నాకేమి తెచ్చునో
అనుచునాడ పిల్ల నంగలార్చ
పిల్లమాట మరచి పెద్ద సీసాలతో
ఇల్లు జేరెనతని దెంత ఘనత

8. దినము దినము నిట్టి దేవిడీ గాళ్ళతో
భరతదేశమిటుల పాడువడగ
జ్ఞానులంత తరిగి జ్ఞానమ్ము శూన్యమై
భరతదేశ ఖ్యాతి భంగపడదె!

9. చదువుకున్నవారు చదువుకొననివారు
మత్తు మందు త్రాగి మదమునెక్కి
వదరు బోతుతనము వాగుడు నెక్కువై
ఇంటి గౌరవమ్ము మంటగాల్చు॥

## బాబూ మందు మాని పని చూసుకో

10. మాదు జన్మకేల మరి మరీ కష్టముల్
అనుచు బాధపడెడి అమ్మనాన్న
బ్రతికినన్ని నాళ్ళు బాధల కుంపటి
కన్ను మూసినపుడె కలుగు సుఖము

11. కర్మకాలి నిన్ను కంటిమి ఆనాడు
ధర్మమేన నీకు త్రాగుడేల
నీకు పెళ్ళి చేసి నే సిగ్గుపడుటేల
మందు మాని నీవు ముందుకేగు

12. రేయి పగలు నిన్ను హాయి మరచి పెంచి
కంటిరెప్పవోలె కాచినాము
కాటికేగు మమ్ము కనిపెట్టుకొనియుండు
ఇదియె చాలు మాకు పదిలమదియె!



13. తోటివారలంత తూర్పారపట్టినా
మానవేల మందు, మాదె కర్మ
కూతురంటి బిడ్డ కోడలై వచ్చును
చిన్నొ పెద్దొ పనిని చేసి పెంచు!

14. తల్లిదండ్రులెంత దర్పమ్ము జూపిరో
నిన్ను కన్ననాడు చిన్నతండ్రి
నేడు నిన్ను జూచి నివ్వెరబోయెడి
తల్లి దండ్రికిదియె తగిన శిక్ష॥

15. పుత్ర సంతతెంత పుణ్యమో మా కని
విఱ్ఱవీగినారు వెఱ్ఱికాదె!
నేడు పుత్రుడిటుల నీరు గారగ జూచి
తల్లడిల్లినారు తల్లిదండ్రి!

16. సంపదెటుల పోయె కొంపముంచెను వీడు
మందు నేర్చినాడు విందుకేగి
సకల సద్గుణములు సరదాగ నేర్చెను
చెల్లెలొక్కటున్న తల్లి కాదె?

## నీ కాళ్ళ మీద నీవు నిలబడు!

1. బ్రతుకుట చేతకాక పదుపాట్లకు లోటది తీరుటెన్నడో
అతుకుల బొంత యీ నడక అందరు తిట్టగ బుద్ధి వచ్చినన్
కతుకుట కేమిలేక కలకాలము కష్టములీదలేక యీ
చితికిన జీవితానికిక చేతికి చిక్కిన జీతగాడివౌ!

2. తిండి దొరకదయ్య తిండిపెట్టరెవరు
కండ కఱగిపోదు బండ మనిషి
ఎండమావులయ్య ఎవరికెవరు బాబు
చివరికెవరు తండ్రి చేరు పనికి!

3. నిన్ను తిట్టుటేల నీ బోటివాళ్ళను
బుద్ధి చెప్పి పంపు బుద్ధి నాది
నేను చెప్పకుండ నీ బోటివాళ్ళకు
తెలియ దేలబాబు తిట్టుటేల?

4. ఆడువారి కష్టమవలీలగా మ్రింగు
పుణ్య పురుషులున్న పుణ్యభూమి
ఎంత గొప్పతనము ఎంతటి పురుషులో
వినెడి వారికిదొక వింత కాదె?

5. మీసమొచ్చుటనగ మెలివేయుటకు కాదు
ధ్యాస పెంచి పనికి దారిచూడు
శక్తి కన్న నిన్ను శ్రమ పడమని కాదు
శక్తి కొలది నీవు భుక్తి వెదకు!

6. యుక్తవయసులోన రక్తమ్ము మరగంగ
భుక్తి వెదకవలయు యుక్తితోడ
కాయకష్టమొకటె కాదయ్య పనియన్న
తెలివితేటలున్న కలుగు ధనము

7. పరుల మేలు కోరి బ్రతుకుట ధర్మమ్ము
మట్టిబెడ్డ కాదె పరుల సొమ్ము
(ఇరుగు పొరుగు వారి హితవు కోరు)
సాయమందుటేల సాయమ్ము చేయుము
అదియె మంచిదయ్య అందరికిని!

8. ధనము పోయినపుడు దరిదాపు చేరరు
ధనము యున్ననాడు దరికి చేరు
లోక సహజ మిదియు లోకమే ఒక మాయ
మాయ తెలిసికొనుట మనిషి గుణము!



## నీ బ్రతుకు నీదె

1. నీవు పుట్టిన విషయమ్ము నిజము నిజము
అటులె మరణించి తీరెద వదియు నిజము
సాగదీయంగ కష్టమ్ము సాలెగూడు
ఆశలెందుకు పెంచెద వాస్తిపైన

2. తప్పు చేసిన బిడ్డను తండ్రి ఒకడె
గుండె లోపల దాచును గుట్టుగాను
అట్టి బిడ్డని ఆ తల్లి ఆదరించి
చక్కదిద్దంగ జూచుట సహజమయ్య!

3. ఎదుటివారికి చెప్పంగ ఎన్నొ తెలుసు
అవియె మనకన్వయించగా అందగించు
జ్ఞాన మార్గమ్ము తెలిసికో ధ్యానమదియె
గురువ దేలయ్య మనకిదే గురువు సుమ్ము

4. శక్తి లేనట్టి బిడ్డకు చదువదేల
ఎన్నొ పనులున్నవయ్యయ్యొ కన్న కొడుకు
రాచి రంపాన పెట్టకు రాదు చదువు
బ్రతుకుతెరవును నేర్పెడి పనులు నేర్పు!

5. పూర్వ జన్మ సుకృత పోకడలవి జూడు
చిట్టి పొట్టి పాప చేయు పనులు
వారి వయసు వారు పాడని పాటలు
వీరు పాడి జూపు తీరు జూడ!

6. తల్లిదండ్రిని బాధించు పిల్లలేల?
చెప్పినట్లుగ వినరయ్య చేతకాక
యుక్త వయసున బిడ్డల కోర్కి లేక
తల్లిదండ్రిని తిట్టుట ధర్మమేన?

7. మనకు పుట్టినట్టి మన బిడ్డ లీరీతి
మెలగుటేల యనెడి కలత ఏల?
మనము తెచ్చుకొనిన మన కష్టములె కదా?
గుండె చేత బట్టి కుములుటేల?

8. బాధ తాళలేక పదిమందికీ జెప్పి
పలుచనగుట తగదు తెలిసుకొనుము
ఇంటనింట నుండె నీ రీతి కష్టముల్
ధ్యానమభ్యసించు ధ్యాస పెంచు

## బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుగార్కి పద్యాష్టకము

1. చిత్రమైన రీతి చిద్విలాసమ్ముతో
మంచి మాట లెన్నొ మాకునొసగు
కోటి కొక్కరైన కోటీశ్వరా మీకు
అంజలించు చుంటినందుకొనుడు

2. ఎన్ని సార్లొ మిములనేరీతి పొగడనొ
తెలియలేదు నాకు తెలియలేదు
పద్యమొక్కటైన హృద్యమై నిలువంగ
పొగడలేని నన్ను తెగడవలెను!

3. రామకథను మీరు రమ్యంగ చెప్పంగ (రసరమ్య బాటలో)
గోవు కథను మీరు కూర్చి చెప్ప
వినెడి వారి కెంత వీనులవిందయ్య
పరవశించగలరు పలుకువినగ!

4. ధర్మసూక్ష్మమెఱిగి ధార్మికబుద్ధితో
మర్మ కర్మలేని మాటనెఱిగి
మంచి యొకటె తెలియు మాన్యులు మీరండి
కల్మషమ్ము లేక గణన కెక్కె!



5. భాగవతము జెప్ప పదిమందికీమీరు
సంతసించినారు సకల జనులు
దూరదర్శనమున దోబూచులాడగా
మురిసి తీరు మీదు మోము జూచి!

6. మీకు తోడు నీడ మీ భార్య గొప్పదై
మంచిమాటలెన్నొ మనవి జేయ
పార్వతమ్మ వోలె భర్తను సేవించ
శివుని నామమందె శివుడవీవు!

7. గోవులెన్నొ మీదు కూర్మితో పెరుగంగ
కాకినాడ సాక్షి కాదె స్వామి।
గోవు విలువ తెలియు గోవర్ధనా మీరు
మానవతను నిలుపు మాన్యులండి!

8. శంభుదాసు వోలె శరవేగమున మీరు
వర్ణనాంశమొకటి కర్ణములకు
అందజేయు తీరు కందాల కందమై
గుడుల గోపురముల గొప్పతనము

## శివస్తుతి

కాపుకాయవా శివా! కాపుకాయవా
కష్టకాల మయ్యయ్యొ కాపుకాయవా!
దేశానికి తాళలేని దెబ్బలెన్నొ తగులుతుంటె
వరద నీరు ముంచెత్తగ వట్టి బేలముఖమువార్ని

కాపుకాయవా శివా! కాపుకాయవా
కష్టకాల మయ్యయ్యొ కాపుకాయవా!
మాట తప్పలేని జనులు మౌనంగా చూస్తుంటె
నోరున్న పెద్దలంత ఊరినేల తిరుగుతుంటె

కాపుకాయవా శివా! కాపుకాయవా
కష్టకాల మయ్యయ్యో కాపుకాయవా!
విద్యయెంతొ విలువైనది మధ్యలోనె ఆగుతుంటె
వ్యవసాయం గొప్పదైన నీ సాయం కోరుతుంటె

కాపుకాయవా శివా! కాపుకాయవా
కష్టకాల మయ్యయ్యో కాపుకాయవా!
ఖైనీలను గుట్కాలను వద్దన్నా మ్రింగువార్ని
దారితప్పి త్రాగుడుతో తెల్లవార్లు తిరుగువార్ని

కాపుకాయవా శివా! కాపుకాయవా
కష్టకాల మయ్యయ్యో కాపుకాయవా!
దేశానికి వృద్ధిలేక జీవితాలు మొద్దుబారె
స్వార్థపరుల బారి నుండి రుద్రుడవై చెలరేగుచు

కాపుకాయవా శివా! కాపుకాయవా
కష్టకాల మయ్యయ్యో కాపుకాయవా!
దిక్కులేక దీనజనులు బక్క చిక్కి పోతుంటె
ముక్కంటిని తెఅచిచూడు రక్షణివ్వగా శివా!

కాపుకాయవా శివా! కాపుకాయవా
కష్టకాల మయ్యయ్యో కాపుకాయవా!
నీదు మహిమ మాకు తెలుసు - క్షణములోన మార్చగలవు
చేతులెత్తి మ్రొక్కుచుంటి - వినుమయ్యా మా మొరను
కాపుకాయవా శివా! కాపుకాయవా
కష్టకాల మయ్యయ్యో కాపుకాయవా!



## సినీ గాయని ఎస్. జానకిగార్కి పంచరత్నములు

1. గాత్ర మహిమ గొప్ప కమనీయమే కదా
పాటవిన్నవారు పరవశించ
చిలుక పలుకు పలికి చిద్విలాసమ్ముతో
పులకరింత కలుగు చిలుక పలుకు

2. దేవదేవుడొసగె దివ్యమౌ గాత్రమ్ము
సానబట్టినారు సంబరముగ
చిత్ర సీమ కెంత సేవజేసితివమ్మ
ఋణము తీరదమ్మ ధనము నొసగ!

3. నీదు పాట వినిన నిముషమే స్వర్గమ్ము
ఎచ్చటైనగాని ముచ్చటౌను
పాటలెన్నొ విన్న పరవశించనివారు
నీదు పాట వినును ఆదరమున

4. గాత్ర మహిమ గూర్చి కమనీయమైనట్టి
గాథలెన్నొ విన్న గంటలెన్నొ
చర్చ లెన్నొ జరుగు చర్చనీయాంశమై
ముచ్చటించు కొనరె మోజు చూపి!

5. భరతమాత కన్న బంగరు తల్లివి
ఇరుగుపొరుగువారి కెంత ఇంపు
జిలుగుచూపి నీవు వెలుగుతో నుండంగ
ఇష్టదైవ మెపుడు నిచ్చు వరము

## నేను రచించిన ఇతర గ్రంథముల పేర్లు

1. ధర్మశతకము
2. ధర్మరాజీయము
3. ధర్మప్రబోధము
4. ధర్మాంజలి

కావ్యశ్రీ (గుండాబత్తుల నారాయణరావు) పద్యకృతులు
ఒక అనుశీలనము - పరిశోధనా గ్రంథము.

